

# గ్రీన్ కార్డ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

***రచనాకాలం: 2000 సంవత్సరం***

**రాత్రి పదకొండవుతోంది.**

"చెప్పింది గుర్తుందిగా?" అడిగాడు శివాజి కానిస్టేబుల్‌ని.

అతను తలూపి లాకప్ తాళం చెవి తీసి అందులో నిద్రపోతున్న ఓ పాతికేళ్ళ కుర్రాడిని లాఠీతో అరిపాదం మీద రాసి లేపాడు.

"లే. సారు పిలుస్తున్నారు."

అతను లేచి కానిస్టేబుల్ వెంట నడిచాడు. మిగిలిన వాళ్ళు కళ్ళు తెరిచి చూసి మళ్ళీ కళ్ళు మూసుకున్నారు.

అతను శివాజి ముందు రెండు చేతులు గట్టిగా ఛాతీకి కట్టుకుని నిలబడ్డాడు.

"నీకు దొరికిన బ్రీఫ్‌కేసులో ఆ లక్షన్నర లేదంటావు?"

"నిజం దొర. లేదు. చెత్తకుండీలో వుందికదాని తీసుకున్నాను. నన్నిడిచి పెట్టండి దొర. విడిస్తే వారంలోగా ఓ పదివేలు తెచ్చిస్తాను."

"అది వద్దుకాని, నే చెప్పిన పనొకటి చేస్తే నీ కేసు మాఫీ..."

"ఏం పని దొర?"

శివాజి వివరించాడు. అంతా విన్నాక చెప్పాడు అతడు.

"అమ్మో."

"ప్రాణభయం వుండదు. లేదా రేపు సి.ఐ. వస్తే మళ్ళీ నీకాళ్ళకి రోకలి కట్టి.."

వెంటనే అతని కళ్ళు భయంతో విప్పారాయి.

"అలాగే దొర. మీరు చెప్పినట్లే చేస్తాను."

"తు.చ తప్పకుండా చెయ్యాలి. లేదా పదేళ్ళు జైల్లో వుంటావు" హెచ్చరించాడు.

"మాట తప్పను దొర" చెప్పాడతను.

కానిస్టేబుల్ అతన్ని తనతో బయటికి తీసుకెళ్ళాడు. ఇద్దరూ పోలీస్ స్టేషన్ వెనక్కి వెళ్ళారు. రెండుసార్లు కెవ్వున అరిచాడు ఆ నిందితుడు.

కానిస్టేబుల్ కత్తిని పాతబట్టలో చుట్టి చెప్పాడు.

"పద. నీకేం కాదులే."

ఇద్దరూ బయట సిద్ధంగా వున్న జీపు ఎక్కారు. అప్పటికే శివాజి జీపులో వున్నాడు. తన భుజానికైనా గాయం నించి నెత్తురు కారకుండా టవల్‌ని వత్తి పట్టుకున్నాడు అతను. కుడిచేతి మణికట్టు దగ్గరైన గాయానికి కట్టుకట్టి వుంది.

కొద్దిసేపట్లో జీపు ఉస్మానియా హాస్పిటల్ బయట ఆగింది. డాక్టర్‌తో మాట్లాడాడు శివాజి. అతని గాయాలని పరీక్షించి కట్టుకట్టి మందు రాసిచ్చాడు డాక్టర్.

అతని పేరు, ఊరు, ఇతర వివరాలు అడిగి ఓ.పి రిజిస్టర్‌లో రాసుకున్నాడు.

ఆ తతంగం పూర్తవడానికి ముప్పావుగంట పట్టింది. బయటికి వచ్చాక అంతా జీపెక్కారు. మళ్ళీ పావుగంట తర్వాత జీపుని బస్‌స్టాండ్ బయట ఆపి చెప్పాడు శివాజి జేబులోంచి వందరూపాయల నోటు తీసిచ్చి. "నువ్వు మీ వూరు వెళ్ళు. ఇంకోసారి హైదరాబాద్‌లో కనపడ్డావో ఖబడ్దార్."

అదిలాబాద్ జిల్లాలోని ఓ వూరినించి హైదరాబాద్ వచ్చి ఓ చిన్న హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తూ అతను చిన్న కొట్లాటలో పోలీసులకి చిక్కాడు. కూకట్‌పల్లి జంక్షన్‌లో పోయిన ఓ బ్రీఫ్‌కేస్ దొంగగా అతన్ని అనుమానించి లాకప్‌లో వుంచారు.

మర్నాడు శివాజి సి.ఐ.కి చెప్పాడు.

"రాత్రి కొట్టి కొట్టి నా లాఠీ విరిగింది. వాడు కాదండి."

"సరే వదిలెయ్."

"పంపించేసానండి."

గోపీనాథ్ ఇచ్చిన అయిదువేలలో పదిహేను వందలు కానిస్టేబుల్‌కి ఇచ్చాడు శివాజి.

గోపీనాథ్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ఆ వార్త మొత్తం చదివాడు.

విరించి అనే అతను అర్ధరాత్రి సెకండ్ షో చూసి ఇంటికి వెళ్తుంటే అతని వెంటబడ్డ ఇద్దరు అతనిమీద కత్తులతో దాడిచేసారని, ఒకరు పేల్చిన పిస్తోలు గుళ్ళు అతనికి తగల్లేదని, ఈ హడావిడికి తలుపు తెరిచిన ఓ ఇంట్లోకి వెళ్ళి తలుపు వేసుకుని ప్రాణాలతో తప్పించుకున్నాడని, పోలీసులకి సమాచారం అందగానే కూకట్‌పల్లి ఎస్.ఐ. శివాజి వచ్చాడని, అప్పటికే దాడిచేసినవారు పరారయ్యారని, ఉస్మానియా హాస్పిటల్‌లో విరించిని చేర్పించారని, స్థానికంగా ఓ జిరాక్స్ షాపు, ఎస్.టి.డి బూత్ నడిపే విరించికి తనమీద ఎవరు ఎందుకు దాడిచేసారో తెలియడం లేదని, గతంలో కూడా ఎవరో తనని చంప ప్రయత్నించారని అన్నాడని వార్త.

దాన్ని, హిందీ డెక్కన్ క్రానికల్‌లలో వచ్చిన అదే వార్తని కూడా ఎవిడెన్స్ ఫైల్‌లో వుంచాడు గోపీనాథ్ - ఎఫ్.ఐ.ఆర్. హాస్పిటల్‌లో రికార్డుల జిరాక్స్ కాపీలతోపాటుగా.

## 8

మానసికి ఆ రోజు కొరియర్ సర్వీస్‌లో ఓ కవర్ వచ్చింది. ఆమె అక్క మాధవి సంతకం చేసి తీసుకుంది. మానసి కాలేజ్ నుంచి రాగానే ఇచ్చి చెప్పింది నవ్వుతూ.

"ఇదేదో ఆ అబ్బాయి నించి వచ్చిందిలా వుంది. అందుకని విప్పలేదే?"

"ఏ అబ్బాయి నుంచి?"

"నీకు ఫోన్ చేస్తూంటాడే అతను. చూసావా? కవర్ పింక్ రంగులో వుంది. మాములు లెటర్ కాదిది. లవ్‌బాంబ్ అయివుంటుంది."

తొలికాన్పుకి పుట్టింటికి వచ్చిన మాధవిది లవ్‌మేరేజ్. వాళ్ళ కులం వేరైనా మారు మాట్లాడక ఆ పెళ్ళికి ఆమోదం తెలిపారు. అబ్బాయి మంచి కుటుంబం అని తెలియడంతో తల్లిదండ్రులు ఆ వివాహాన్ని వ్యతిరేకించలేదు. అయితే అబ్బాయి వైపు వాళ్ళు ముందు నో అన్నా చివరికి ఒప్పుకున్నారు.

మానసి బాత్ రూంలోకి వెళ్ళి చీర విప్పి నైటీ వేసుకుంది. తర్వాత ఆ కవర్‌ని తీరిగ్గా చింపింది.

తెల్లకాగితాల దొంతర స్టేపిల్ చేసి వుంది. రంగురంగులలో తెలుగు, ఇంగ్లీష్‌లలో అనేక వాక్యాలున్నాయి. అది కంప్యూటర్‌లో తయారు చేసి, కలర్‌లో తీసిన ప్రింటవుట్.

మొదటి పేరాలో డయానాని పెదవుల మీద ముద్దు పెట్టుకుంటున్న యువరాజు చార్లెస్ బొమ్మ. దానికింద పింక్ రంగులో కొటేషన్.

"బార్బర్‌ని ఎన్నడూ నాకు హెయిర్‌కట్ అవసరమా?" అని అడగద్దు. అలాగే ప్రియురాలిని ఎన్నడు "నిన్ను ముద్దుపెట్టుకోనా?" అని అడగవద్దు. ఇద్దరి సమాధానం ఒకటే.

చిన్నగా నవ్వుకుని ఆ పేజీ తిప్పేసింది.

మరో చిత్రం వుందా పేజీలో. సైకిల్ సీటు మీద కూర్చుని వున్న యువకుడి భుజాల మీద రెండు చేతులూ వేసి హేండిల్ బార్ మీద అతని వైపు కూర్చుని, అతన్ని కళ్ళు మూసుకుని ముద్దు పెట్టుకుంటున్న ఓ అమ్మాయి బొమ్మ.

దానికింద ఇలా వుంది.

"ముద్దు పెట్టుకునేప్పుడు కళ్ళు తెరిచి చూసే అమ్మాయినెన్నడూ నమ్మద్దు."

తర్వాత పేజీలో నెదర్లాండ్స్ టెన్నిస్ స్టార్ రిచర్డ్ క్రాయిసెక్ తన వధువు డెకెర్స్‌కి ఇస్తున్న ముద్దు దృశ్యం కలర్‌లో వుంది. అది దిన పత్రికలో స్పోర్ట్స్ కాలంలోంచి స్కేనర్‌తో కంప్యూటర్‌లోకి ఎక్కించి తీసిన ప్రింటవుట్ అని గుర్తించింది మానసి. ఇదివరకు దాన్ని ఓ దినపత్రికలో చూసింది ఆమె. దానికింద ఈ కొటేషన్ వుంది.

ప్రేమతో చెప్పే వెయ్యి మాటలకంటే ఓ ముద్దు ఎక్కువ చెప్తుంది.

తర్వాతి పేజీలో ఓ గాడిద బొమ్మ, దాని కింద ఇంగ్లీషులో ముద్దు మీద ఓ కవిత్వం వుంది. ఒక లైన్ నీలం, ఇంకోలైన్ మెజెంటా రంగులో వుంది.

ఈ జగతి ఓ గాడిద
గుడ్డి గాడిద సుమండీ
నీ ముద్దులు ఎంత తీయనివో
ఈ మొద్దు ప్రపంచానికేం తెలుసు?
నీ ముద్దులో ఎన్నెన్ని మురిపాలుంటాయో
ఎంత ఆనంద పారవశ్యకత వుంటుందో
ఈ మొద్దు ప్రపంచానికి తెలీదు.
ఈ జగతి ఓ గాడిద.
కనుకనే ముద్దుకి అనవసరంగా
మూడు ముళ్ళ బంధం వేసింది.

ఇంకో పేజీ తిప్పింది మానసి.

హృదయం ఆకారంలో వున్న తాళం కప్ప, దాన్ని తెరుస్తున్న తాళం చెవి రెండో చివర హృదయం ఆకారం. దాని కింద ఇంగ్లీషులో వుంది.

"కిస్ ఈజ్ ది సోల్ ఆఫ్ లవ్ అండ్ కిస్ ఈజ్ ది కీ టు హార్ట్.

తర్వాత పేజీలో ముద్దు మీద ఓ జోక్ వుంది.

"ప్రేమలో పడ్డ జేమ్స్, మేరి లండన్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం టిక్కెట్ కొనుక్కుని బయలుదేరి వెళ్ళే రైలున్న ప్లాట్‌ఫారం మీదకి చేరుకుని 'గుడ్ బై కిస్'లు పెట్టుకోసాగారు.

ఇలా నాలుగు ప్లాట్‌ఫారాల్లో నాలుగు రైళ్ళ దగ్గర వాళ్ళిద్దరు ఆ పనిచేశాక, వాళ్ళిద్దరి అవస్థని గమనించిన టి.సి వాళ్ళని పిలిచి ఇలా చెప్పాడు.

"ఇక్కడ్నించి రైళ్ళు గంటకొకటి కాని బయలుదేరవు. బస్ స్టాండ్‌కి వెళితే ప్రతి అయిదు నిముషాలకో బస్సు బయలుదేరుతుంటుంది."

మానసి నవ్వడం గమనించి అడిగిది మాధవి.

"తర్వాత నాకూ చూపించవే. కొంచెం సేపు సిగ్గు ఇంకొంచెం సేపు ఆసక్తి. ఇంతలో నవ్వు. ఆ అబ్బాయికి ప్రేమలేఖలు బాగా రాయడం వచ్చులా వుంది." అక్క మాటలు వినిపించుకోకుండా తర్వాతి పేజీని తిప్పింది మానసి.

"ముద్దు ఎలా పెట్టుకోవాలంటే" అనే పెద్ద అక్షరాలు హెడ్డింగ్ కింద తెలుగులో మేటర్ రాసివుంది.

జాక్వెస్ బారస్ అనే ఫ్రెంచ్ దర్శకుడు తను దర్శకత్వం వహించే చిత్రం 'కామెడి ఫ్రాంకెయిస్'లో ఓ రొమాంటిక్ దృశ్యాన్ని చిత్రీకరిస్తున్నాడు. ఓ యాక్టర్ ఆయన ఆశించిన మేరకి తన ప్రియురాల్ని ముద్దు పెట్టుకోవడంలేదు. విసిగిపోయి చివరికి ఆ దర్శకుడు ఇలా చెప్పాడు.

"చూడు. సాయంత్రం అయిదయిందనుకో. ఆమె భర్త ఆఫీస్ నుంచి ఇంకో రెండు నిముషాల్లో వస్తున్నారనుకో. నీకు ముద్దు పెట్టుకోవడం సరిగా రాదు. మళ్ళీ నిన్నెందుకు కలవాలి అని ఆమె అన్నదనుకో. ఆ పరిస్థితిలో నువ్వు ఆమెని తిరిగి కలవాలనుకుని ఎలా ముద్దుపెట్టుకుంటావో ఆలోచించుకుని అలా ముద్దు పెట్టుకో" తర్వాతి టేక్ ఓకే అయింది.

తర్వాతి పేజీని తిప్పింది మానసి. డెయిలీలోని ఓ న్యూస్ ఐటమ్ ప్రింటవుట్ అది.

క్రుర 'కారు' ముద్దుల పోటీ.

20 ఏళ్ళ ఇవలిన్స్, ఆమె బోయ్ ఫ్రెండ్ అయిన 20 ఏళ్ళ మర్సియో జోస్ 8.83 గంటల 45 నిమిషాలు ముద్దు పెట్టుకుని ఓ కారుని బహుమతిగా గెల్చుకున్నారు. ఈ పోటీ బ్రెజిల్‌లోని ఓ వూళ్ళో జరిగింది. ఓ కారు షాపు యజమాని ప్రకటించాడు. రోజంతా ముద్దు పెట్టుకునే జంటకి ఓ కారు బహుమతని. జంటలు ఆ షాపులోని ఓ ప్లాట్‌ఫాం మీద నిలబడి ముద్దుపెట్టుకుంటే చూడడానికి అనేకమంది వచ్చారు. దాంతో వాళ్ళ కారల్ సేల్స్ 50 శాతానికి పెరిగింది. నుంచునే వుంటే కాళ్ళు పీకుతాయి కాబట్టి రాక్ - ఎన్ రోల్ మ్యూజిక్‌కి నృత్యం చేస్తూ జంటలు ముద్దులు పెట్టుకోసాగారు. ముందు ఉదయం నుంచి రాత్రంతా పోటీ జరిగినా 46వ రోజుకి ఉదయం 8.30 నుంచి తెల్లవారు ఝామున 2.30కి మారింది. ఇంటి కెళ్ళి 5 గంటలు నిద్రపోయి మళ్ళీ రావాలి. మధ్యాహ్నం పావుగంట మాత్రం లంచ్‌బ్రేక్.

62వ రోజు దాకా ఈ జంట పట్టువదలకుండా చుంబన క్రీడ సాగించారు. పోటీదారులు విరమించుకున్న అయిదు నిమిషాల తర్వాత వారు ముద్దుపెట్టుకోవడం ఆపి కారుని గెలుచుకున్నారు. త్వరలో పెళ్ళి చేసుకోవాలని కూడా నిశ్చయించుకున్నారు.

"బట్.. మనం కూడా ఓ కారు గెల్చుకోవాలని వుంది. విరించి చేతి వ్రాతలో వుందో వాక్యం.

తర్వాతి పేజీ తిప్పింది.

"నాకు ముద్దు ఇచ్చినందుకు మీ అమ్మ చివాట్లు పెట్టిందా?"

"అవును. నిన్ను చాలా తిట్టింది."

"ఐతే నేను చెప్పినట్లు చెయ్యి."

"నువ్వు చెపితే ఏమైనా చేస్తాను."

"నువ్వు నాకిచ్చిన పధ్నాలుగు నిమిషాల ముద్దులని తిరిగి ఇప్పుడు తీసుకో."

"ఎలా?"

"అవి నా దగ్గరే వున్నాయిగా. నేనే యిచ్చేస్తాను" అతనామెని అంతసేపు ముద్దు పెట్టుకున్నాడు.

"తీసుకున్నాను. ఏం చెయ్యను?"

"మీ అమ్మతో ఈ విషయం చెప్పి ఇంక కోప్పడద్దను."

ఇంకో పేజీలో ఇలా వుంది.

1837లో లండన్ కోర్ట్‌కి ఓ కేసు వచ్చిది. థామస్ సెవర్‌లాండ్ అనే అతను కెరొలిన్ అనే ఆమె మధ్య వ్యాజ్యం అది. థామస్ బలవంతగా కెరొలిన్‌ని ముద్దు పెట్టుకుంటే, ఆమె అతని ముక్కుని కొరికేసింది. తను చేసిన నేరం గాలిలో కలిసిపోయింది. ఆమె చేసిన నేరం జీవితాంతం తనని కురూపిని చేసింది కాబట్టి ఆమెని శిక్షించమని న్యాయాధికారిని వేడుకున్నాడు థామస్. ఒక స్త్రీ ఇష్టాఇష్టాలకి వ్యతిరేకంగా ముద్దు పెట్టుకోవడం దారుణమైన అపరాధం అని, అలాంటి పనిచేసిన పురుషుడికి స్త్రీ విధించదగ్గ శిక్ష ముక్కు కొరకడమే అని తీర్పు యిచ్చాడు జడ్జి.

కాబట్టి ఓ ప్రియతమా! నా ముక్కుని కొరకనని మాటివ్వవా?

- విరించి

రిప్లై అనే హెడ్డింగ్‌తో కింద రెండు బ్లాంక్ కాగితాలున్నాయి. కొద్ది సేపు ఆలోచించి ఇలా రాసింది మానసి.

ఎయిర్ హోస్టెస్‌ని పెళ్ళి చేసుకున్న సీతారాం ఓ రోజు విమానంలో ప్రయాణిస్తుండగా అతని భార్య సీత డ్యూటీలో వుంది.. ప్రయాణీకులందరికీ స్నాక్స్ సర్వ్ చేశాక సీటులోకి తీసుకెళ్ళి తన భర్తని ముద్దు పెట్టుకుంది. తర్వాత లేచిచూస్తే క్యూలో నిలబడ్డ నాలుగుమంది ప్రయాణీకులు ఓపికగా తమ వంతు కోసం ఎదురుచూస్తూ కనిపించారు.

నీతి: పెళ్ళయ్యాక ప్రైవసీతో చేయాల్సిన ఈ పని పెళ్ళికి మునుపు బందిలు చెయ్యరాదు.

శరీరానికి విటమిన్లు ఎలాగో, ముద్దులు వివాహానికి అలా. శరీరం లేకుండా విటమిన్లు ఎలా సాధ్యం కావో, వివాహం లేకుండా ముద్దులు అలాగే సాధ్యపడవు.

బలవంతంగా ఎవరూ నన్ను ముద్దు పెట్టుకుని ముక్కుని కొరికించుకోలేరు. ఎంచేతంటే నవ్వే పెదవులని ముద్దు పెట్టుకోవడం అసాధ్యం. మన జీవితాలు మూడుముళ్ళు, ఆరు ముద్దులుగా మారేదాకా ఆగాలోయ్ బాబ్జీ.

అది రాసి నవ్వుకుంటున్న మానసిని చూసి అడిగింది అక్క మాధవి.

"ఏం రాసావే అంత నవ్వు? అతనేం రాసాడు?"

"చూస్తావా?"

"ఇతరుల ప్రేమలేఖలంత ఆసక్తి కలిగించేది ఈ లోకంలో ఇంకోటుండదు. ఒకళ్ళనొకళ్ళు పిలుచుకునే ముద్దుపేర్లు, చిలిపి తగాదాలు, విరహాల సొగసులు ఎంతో తమాషాగా వుంటాయి. చదివిస్తా ఇవ్వు."

"నువ్వనుకొన్నవేం లేవులే."

దాన్ని మడిచి ఇంకో కవర్లో వుంచి అతికించి పైన అడ్రస్ రాసింది. ఆ సాయంత్రం అతనిని కంప్యూటర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో తప్పక కలుస్తానని తెలుసామెకి. అందుకే ఆ కవర్‌ని తన హేండ్‌బేగ్‌లో వేసుకుంది.

గోపీనాథ్ ఇ - మెయిల్ బూత్‌కెళ్ళి అమెరికాలోని సునీతకి నెట్ స్కేప్‌లో ఓ మెయిల్ టైప్ చేసాడు. తనకి ఆమెనించి ఓ సహాయం కావాలని, అది తన తమ్ముడు అమెరికాకి వచ్చేందుకు సహాయపడేది కాబట్టి చేయగలదో లేదో వెంటనే తెలియచేయమని కోరాడు. తనడిగేది లీగల్ కాదని, అలా అని ఇల్లీగల్ కూడా కాదని రాసాడు.

ఆమె భర్తని అడిగానని చెప్పమని కూడా రాసాడు.

జావా నేర్చుకుంటున్న విరించి తన క్లాస్ అయిపోగానే బయటకి వచ్చాడు. వస్తూ మానసి క్లాస్ తలుపు తెరిచి చూసాడు. ఆమె ఆ క్లాస్‌లో వుండడంతో బయటకి వచ్చి నిలబడ్డాడు. పావుగంట తర్వాత వచ్చి అతన్ని కలిసి చెప్పింది మానసి.

"హాయ్! ఏమిటి ఆలోచనల్లో పడ్డట్లున్నావు?"

"ఏం లేదు. నీ కోసమే వెయిట్ చేస్తున్నాను."

"పద. మన పేలస్‌లో సేవకులు మనకోసం ఎదురుచూస్తుంటారు" నవ్వింది.

ఎప్పుడూ ఆ ఇద్దరూ వెళ్ళే ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్‌కి వెళ్ళారు. విరించి కోక్ బాటిల్‌కి, ఓ చీజ్ పిజ్జాకి టోకెన్ తీసుకున్నాడు.

"నే పంపిన కొరియర్ అందిందా?" అడిగాడు.

"నువ్వు పంపింది కొరియర్ కాదు. కొరియర్‌లో కవర్."

హేండ్ బేగ్ లోంచి కవర్‌ని తీసి అతనికి అందించింది. దాన్ని అక్కడికక్కడే చింపి ఆమె జవాబు చదివాడు. అతని మొహంలో కొద్దిగా నిస్పృహ కనిపించిది.

"ఈ ప్రపంచం అడుగుపెట్టినా, నువ్వు ట్వెంటీఫస్ట్ సెంచరీలోకి అడుగుపెట్టలేదు" చెప్పాడు కాసేపాగి.

"ట్వంటీఫస్ట్ సెంచరీలోకి అడుగుపెట్టడం అంటే ఏమిటో నీకు తెలీదు."

"నీకే తెలీదు."

"నాకు తెలుసు. ఇ- మెయిల్ ద్వారా పిజ్జాని ఇంటికి ఆర్డర్ చేయడంలాంటివి ట్వంటీ ఫస్ట్ సెంచరీలోకి అడుగుపెట్టడం అంటే."

"నన్ను కొత్తగా నువ్వు అంటున్నావేమిటి?" అడిగాడు.

"అనాలనిపించి నువ్వు నాకు బాగా దగ్గరయ్యావు అన్న గుర్తుగా అంటున్నాను."

"ధన్యోస్మి. కాని నన్ను దూరంగానే వుంచుతున్నావు. ముద్దంటే రెండు పెదవుల కలయిక కాదు. రెండు ఆత్మల కలయిక."

"నీకు తెలీదేమో! రెండు ఆత్మలు ఎన్నడూ కలవవు. అవి విడివిడిగా వెళ్ళి పరమాత్మలో కలుస్తాయి తప్ప."

"ఛీజ్ పిజ్జా, కోక్" గట్టిగా చెప్పాడు కౌంటర్‌లో యూనిఫాంలోని కుర్రడు, కూర్చున్న వాళ్ళవంక చూస్తూ.

విరించి లేచి వెళ్ళి వాటిని తీసుకువచ్చాడు. మానసి టమాటో కెచెప్ బాటిల్‌ని అందుకుని తన వంతు కట్ చేసిన ముక్కలమీద చల్లిందది. విరించి ముక్కలమీద చిల్లీసాస్‌ని చల్లింది. ఇద్దరూ ఫోర్క్‌లతో పిజ్జాని తింటూ, మధ్య మధ్యలో ఒకే బాటిల్‌లోని కోక్‌ని షేర్ చేసుకుని తాగసాగారు.

"అసలు నన్నడిగితే ఈ ట్వంటీ ఫస్ట్ సెంచరీలో మార్పులు తెస్తేకానీ ఎలాంటి ఆడవాళ్ళు మాట వినరు" అని చెప్పాడు.

"ఏం మార్పులు?"

"పదహారేళ్ళు దాటిన అమ్మాయిలని ఆమె ప్రియుడు ముద్దుపెట్టుకోవడం వల్ల ఆమె శీలానికేం కాదు అన్న రూల్ తేవాలి. 'ఆర్ యూ ఓవర్ సిక్స్‌టీన్? కిస్ హిం' కేంపైన్‌ని ప్రభుత్వం స్టార్ట్ చేయాలి."

"పబ్లిక్‌కి చెప్పు. ఓట్లు బాగా పడతాయి."

"మనలాంటి వాళ్ళు ఇలాంటి చోట్లకి వస్తే బిల్‌లో 'లవర్స్ కన్సెషన్' ఏభై శాతం ఇవ్వాలి."

"అప్పుడు వీళ్ళు మనలాంటి వాళ్ళని చస్తే రానివ్వరు."

"ఆ ఏభై శాతం ప్రభుత్వం సబ్సిడీగా ఇవ్వాలి. ఓట్లకోసం ఎన్నిటికి సబ్సిడీలు ఇవ్వడం లేదు?"

"ఈ ప్రామిస్‌ని ఎవరు చేస్తే కుర్రాళ్ళ ఓట్లన్నీ వాళ్ళకే పడతాయి."

"లేడీస్ కాలేజెస్‌ని బేన్ చేసి కో ఎడ్యుకేషన్ కాలేజీలు కంపల్సరి చేయాలి. ఓ మగాడికి సీట్ ఇవ్వాలంటే కంపల్సరీగా ఓ ఆడదానికి కూడా సీట్ ఇవ్వాలన్న రూల్ పాస్ చేసి పారేయాలి."

"అప్పుడు నాలాంటి వాళ్ళు ఇళ్ళల్లో ట్యూషన్స్ చదువుకుని ఓపెన్ యూనివర్సిటీలకి రాస్తారు."

"పబ్లిక్ పార్కుల్లో, థియేటర్లలో, హోటల్స్‌లో ప్రేమికులకి, నాన్ సిగరెట్ స్మోకింగ్ జోన్‌లా ఓ ప్రత్యేక స్థలం కేటాయించాలి. వారి ఏకాంతాన్ని భగ్నం చేసే వారిని టాడా క్రింద అరెస్ట్ చేయాలి."

"అప్పుడు భగ్న ప్రేమికులకి ప్రత్యేక  హాస్పిటల్స్ కూడా తెరవాల్సి వుంటుంది."

"పెళ్ళికాని వాళ్ళు ఆలస్యంగా ఇంటికి వెళితే తల్లితండ్రులు ఎందుకు లేటైంది, ఎవరితో సినిమాకి వెళ్ళావు? లాంటి చెత్త ప్రశ్నలు వేయకుండా వాళ్ళకి 'మళ్ళీ బడికి పంపి బ్రెయిన్ వాష్ చేయాలి. ప్రేమికులందరికి గుర్తింపు కార్డులిచ్చి, వాళ్ళని పోలీసులు అరెస్ట్ చేయకుండా నిరోధించాలి. టీజింగ్ కేసులన్నీ పోలీసులు ఎత్తేయాలి."

"మెహబ్బత్ పార్టీని పెట్టి ఈసారి ఎన్నికల్లో నిలబడు. గెలుస్తావు?"

"వైనాట్? నా పార్టీ అధ్యక్షురాలు ఎవరో తెలుసా?"

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**